# 3

# కలలూ-
# కలవరింతలూ...

సావిత్రికి అంతా తీరికే. అందుకే మరీ పదిహేనురోజులనుంచీ ప్రొద్దుటే ఆయన ఆఫీసుకెళ్ళినప్పటినుంచీ మళ్ళీ సాయంకాలం ఆరుగంటల దాకా చిరాకెత్తిపోతున్నది. ఏమీ తోచి చావదు. కోప గించుకుందా మన్నా మనుషులెవ్వరూ లేరు. ఎవరిమీద కోపగించు కోవాలో కూడా తెలీటంలేదు.

నగరానికి దూరంగా విసిరివేయబడ్డట్టుగా వున్న భవనంలో పొద్దు యెట్లాపోతుంది? మనసు కేమిటో దిగులుగా వుంటుంది వొంటరితనం. బిక్కు బిక్కు మంటున్నట్లుగా వుంటుంది. ఆయన పిసినారి తనం కలవారుకాదు కాని, మొదలు నగరానికి దూరంగా ప్రశాంతంగా వుండేందుకు తాను కూడా ఉత్సహించింది. అందుకే ప్రోత్సాహపరచింది. పైన తాను ఇప్పుడు బాధపడుతున్నట్లుగా, మొదలు మొదలు బాధపడవలసిన అవసరం లేకపోయింది. నిజానికి తాను వొంటరిదైనా, ఇన్నాళ్ళూ ఇతరులకు తాను వొంటరిది కాని, ఇప్పుడు తనకే తెలిసిరావటటం బాధాకారణమైంది. మొదలు మొదలు పక్కింటి పిన్నిగారు—'ఏడుగురు పిల్లల తల్లి'—"నీకేమమ్మా, సావిత్రమ్మా, అంతా తీరికే. ఎంతసుఖం.హాయి! చావొస్తున్నది యీ పిల్లలతో వేగలేక" అంటే—నిజంగానే తాను సుఖపడిపోతున్నాను

కాబోలును అనుకునేది. కాని ఇప్పుడు అలా అనిపించటంలేదు. విచిత్రమే. అసలు యీ రెండు భాగాలవాళ్ళూ ఒక్కసారిగా ఖాళీచేసి పోకపోయినట్లయితే ఇప్పటికీ తనకు తెలిసేది కాదు యీ బాధ. వాళ్ళు వున్నంతకాలం ఎప్పుడు వెళ్ళిపోతారా భగవంతుడా అనుకునేది. ఇప్పుడనిపిస్తున్నది, వాళ్ళు ఉండి వుంటేనే బాగుండేది అని. మనస్సు పీకుతున్నది, అయ్యో వాళ్ళను ఇంకా ప్రేమించలేదే అని. ఇంకా అభిమానించలేదే అని, అయోమయం మనుషులని యెందుకు విసుక్కున్నానా అని. కాని వాళ్ళు వెళ్ళిపోయారు. మళ్ళీ ఏవూళ్ళోనో, ఏ యిరుకైన అద్దె కొంపలోనో-మూడవతరగతి రైలుపెట్టెలోలా, వాళ్ళ జీవితం సాగిపోతూనే ఉంటుంది.

నగరానికి కొంచెమేం, బాగానే దూరంగా వున్న ఆ పేటలో, విశాలమైన ఆ మేడలో, చౌకగానూ, సౌకర్యంగానూ ఒక భాగం అద్దెకు దొరుకుతున్నది కదా అని సావిత్రివాళ్లు అద్దెకు తీసుకున్నారు. నగరాల్లో ఇళ్ళు అద్దెకు చౌకగా దొరకవు. ఆఫీసులూ ఇళ్ళ దగ్గరగా ఉండవు. రోజూ ఊరికిపోయివచ్చినట్లుగా, సన్నకారు ఉద్యోగస్థులంతా, లోకల్ ట్రెయిన్స్‌కోసరమూ, సిటీ బస్సులకోసరమూ యెదురు చూస్తూ విసుక్కుంటూ, వేసారుతూ మళ్ళీ సాయంకాలానికి దీపాలు పెడుతుండగానూ, పెట్టిన తరువాతనూ పుట్టలు పుట్టలుగా మేతకుపోయిన పక్షులు గూళ్లు చేరుకునే రీతిని, అలసిపోయి యిళ్ళకు వస్తారు. నిజంగా సావిత్రీవాళ్ళు ఆయన ఆఫీసుకు అంతదూరంగా వుండవలసిన అవసరమేమీలేదు. వాళ్ళకు ఇల్లు అంత చౌకగా దొరకవలసిన అగత్యమూలేదు. అయినా ప్రశాంతతకోసరమే అంత దూరం వచ్చారు. ఆయన అన్నారు, ఆ యింట్లో చేరిపోగానే, "అమ్మయ్య! ప్రాణం లేచి వచ్చింది! ఇక్కడ అంతా చూస్తుంటే, చిన్నప్పుడు మా వూళ్ళో వున్నట్టుగానే వుంది నాకు. ఈ పెరట్లో చెట్లు పాదులు పెంచుకోవచ్చు. మనం గేదెను కొనుక్కున్నా యిబ్బంది లేదు. ఇక్కడ ఉంటే...."అని ఆయన ఉత్సాహం చూపారు. ఆయన

గారి అంత ఉత్సాహాన్ని చూసి సావిత్రికూడ నిజమే కాబోలు నను కుంది. కాని ఎత్తైన వరండాలోంచి, దిగులైన సాయంకాలపు వేళల దూరంగా లోకల్ రైల్వేస్టేషన్ వైపూ, ఆ పట్టాలవేపూ, అటూ ఇటూ అరచుకుంటూ వెళ్ళే రైళ్ళవేపూ చూస్తుంటే "చుట్టు చుట్టు పక్షులెల్ల చెట్టు వెదకురీతిగాను, పట్టులేక నీ పదములు పట్టుకొందు, త్యాగరాజ వినుత....రామా" అన్న కృతి మాత్రమే గుర్తువస్తున్నది కాని, ఆయన వర్ణించిన సౌఖ్యమంతా వర్ణనలోనే ఉండి పోయిన ట్లని పిస్తుంది, సావిత్రికి.

ఆ మేడలో మూడు భాగాలున్నాయి. మేడ పైభాగాన ఇంటి వాళ్ళు సామాను భద్రపరచుకుని, పెద్దపెద్దతాళాలు వేసుకుని ఎక్కడికో వెళ్ళిపోయారు. క్రింద మూడు భాగాలున్నాయి. మూడున్నూ సమాన మయిన భాగాలే అయినప్పటికీ, మధ్యభాగం తక్కిన రెండింటికన్నా ఇంకొంచెం సౌకర్యంగా వుంటుందని పక్క రెండు భాగాలవాళ్ళూ అనుకుంటూ వుంటారు. అందులో ఏ కొంచెమో నిజంలేకపోలేదు. సావిత్రీవాళ్లు వచ్చేటప్పటికి మధ్యభాగం ఖాళీగాలేదు. అందువలన వాళ్ళు పక్కభాగంలోనే చేరిపోయారు. ఆ మధ్యభాగంలో వుంటు న్నాయన సావిత్రీ వాళ్ళాయనకు స్నేహితుడు కావటమూ, వాళ్ళ ప్రోత్సాహంవల్లనే, దూరమైనా వాళ్ళాయింట్లో చేరటమూ జరిగింది. ఆ ఇల్లాలే 'ఏడుగురు పిల్లల తల్లి'. ఆమెకు వయసుకూడ ఎంతో లేదు. ఆమెను సావిత్రి 'పిన్నిగా'రని పిలిచినా, అలా పిలవటానికి ఒప్పుకోవటమేకాకుండా, మౌనంగానైనా ఉండక, ఆ పిలుపుకి 'ఊ' కొట్టేది. ఇంతాచేస్తే ఆమె సావిత్రికంటే మహా అయితే పదేళ్లు పెద్దదికావచ్చు. వొత్తి వెర్రిబాగుల్ది. పిల్లలుపుడితే వుట్టినే వయసు పైబడుతుంది కాబోలు. అంతే క్షమా, ఓర్పూ, నిగ్రహమూ, నిండుతనమూ అన్నీ వచ్చేస్తవి కాబోలు. సావిత్రికి ఆ పొరుగు పిన్నిగారి పిల్లలగోల తట్టుకోవటం కష్టంగానే తోచినా ఒక రకంగా ఆమెతో బాగా కాలక్షేపం జరిగిపోయేది. అయితే అలా ఎక్కువకాలం సాగలేదు. వాళ్ళు బదిలీ అయి మరో ఊరు

వెళ్ళిపోయారు. అప్పుడే సావిత్రీవాళ్లు మధ్యభాగంలోకి వచ్చారు. పది రోజులపాటు సావిత్రికి ఆ మధ్యభాగంలోకి వచ్చిన తర్వాత చిర్రెత్తిపోయింది. పిల్లల సౌఖ్యం తెలిసివచ్చింది. నవ్వూవచ్చింది. గోడలనిండా 'అ,ఆ'లు, ఇంకా ఆంజనేయస్వామి బొమ్మలు, ఇస్త్రీబట్టలు, పాలవానికి, బొగ్గులకు మొదలైన పద్దులు, అల్మారాలలో పగిలిపోయిన గోలీలు, తీసి వేసిన సిగరెట్ పెట్టెలూ మొదలయినవన్నీ యెక్కడబడితే అక్కడ ప్రత్యక్షమైనాయి. సుద్దముక్కలతో వ్రాసినవి మాత్రం వోపిగ్గా చెరిపి వేసింది సావిత్రి. పెన్సిళ్ళ ఉపయోగాన్ని బాగా తెలుసుకున్న వాళ్ళ పిల్లలు, చాకలి పద్దులను శాశ్వతం చేసి పోయారు కొన్ని గోడలమీద. ఇక వాళ్లు వేసిన ఆంజనేయస్వామి బొమ్మలూ, బాతులూ చిలకలూ, అవన్నీ చూసి, వాళ్ళ కళాకౌశలానికి అబ్బురపాటు చెందకపోగా "మీ బొమ్మలే వేసుకున్నారా!" అని లోలోపలే మండిపడింది. సరే అలా కొన్నాళ్ళు కాలక్షేపమయింది. అదీ నయమే!

తరవాత తాము ఖాళీ చేసిన భాగంలోకి యెవరో వచ్చారు. ఈవేపు ఇదివరకే వున్నారు. ఈవేపు భాగంలో వో కుటుంబమూ, ఆవేపు భాగంలో వో కుటుంబమూ వుండటం మూలాన సావిత్రికి తోచకపోవటమంటూ లేకపోయింది. ఇది ఇదివరలో కథ.

ఇప్పుడు ఆ రెండు భాగాలవాళ్లూ పది పదిహేనురోజులు అటూ యిటూగా ఖాళీచేసి పోయారు. ఉన్నన్నాళ్ళూ వాళ్ళని విసుక్కున్నా వాళ్ళు వెళ్ళిపోయిన తరవాత, వాళ్ళ విలువ తెలిసి వచ్చింది సావిత్రికి. వాళ్లు వెళ్ళిపోతున్నారన్నప్పుడే దిగులైంది. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత మరీ దిగులైంది. సావిత్రి వాళ్ళను విసుక్కోకపోయేదే! ఏం చేస్తుంది? ఒక భాగంలో వున్న వాళ్ళ చంటిపాప ఏడ్చినప్పుడు ఆ భవనం తాలూకు పునాదు లన్నీ కదిలిపోయేట్లు యేడ్చేవాడు. 'వాడికి యెప్పుడూ ఆకలే' అని వాళ్ళమ్మ విసుక్కునేది. పాలు కలిపి పట్టేలోపున్నే గందరగోళం చేసేవాడు ఆ పాపడు. ఇంక యీవేపుభాగంలో వో ముసలాయన వుండేవాడు.

అర్ధరాత్రి మొదలుకొని మనుషులను నిద్రపోనిచ్చేవాడు కాదు. పాటలూ, పద్యాలూ, "బధ్వా కళ్ఠై ర్యమభటా బహు భర్త్సయన్తి, కర్షన్తియత్ర పథి పాశ శతైర్యదామామ్, ఏకాకినం పరవశం చకితం దయాళో, లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్" మొదలుకొని "రామరామా యనవే, పాపపూజిహ్వా...." వరకూ ఎన్నో పాటలు పాడేవాడు. అర్ధరాత్రి లేచి కూచుని, యమభటులు వచ్చి ఎదురుగా నిల్చున్నట్లూ, వారి బారినుండి తనను రక్షించమని వేడుకుంటున్నట్లూ మొదలుపెట్టేవాడు. ఓసారి ఉండబట్ట లేక, చిన్నగా పాడుకోమని చెబుదామని సావిత్రి వెళితే, జగన్మిథ్యా తత్వమూ, జీవేశ్వర సంబంధమూ మరీ బోధించిగాని ఆయన వదలిపెట్టలేదు. అందుకని అప్పటినుంచీ ఆయనఎదుట పడటానికే భయపడేది సావిత్రి. చచ్చినట్లు విధిగా భరించేది. ఆ పాప మరీ చిన్న పాప. ఈ తాతగారు మరీ పెద్దవారు. వీళ్ళిద్దరినీ తలచుకొన్నప్పుడల్లా సావిత్రి. వెడనవ్వు నవ్వుకునేది. పిల్లలు లేకపోతే మానె అనీ, కుటుంబంలో పెద్దవాళ్ళు లేకపోయినా సరే అనీ అనుకునేది.

ఓసారి ఎవరో జాలిని వ్యక్తపరిచారు. సావిత్రికి పెద్ద దిక్కు ఎవరూ లేరే అని. ఇంకోసారి ఇంకోరు చిన్నదిక్కుకూడా యెవరూ లేరే అని (అంటే పిల్లలు) సానుభూతి చూపబోయారు. సావిత్రికి కోపం వచ్చింది అప్పుడు. తన బాధ వీళ్ళ కెందుకూ అని పించింది. అలా కాలం గడుస్తూ వచ్చింది. ఇప్పుడైనా మరీ తోచక ఆమె బాధపడుతున్నది కాని, మరెందుకూకాదు. అంటే ఇవి లేక పోయేనే అనికాదు. ఇవివుంటే బావుండునే అనీ కాదు. మరీ బాధా కరమైన విషయ మేమిటంటే రెండు భాగాలూ ఖాళీగా వున్నవని ఆయనకు తెలుసు. తెలిసినా "నీకు యెలా పొద్దుపోతోంది? పుస్తకా లేవైనా తెచ్చి యివ్వనా? పోనీ యివాళ సినిమాకు వెళ్దామా" అని కాని అడగకపోవటం. అస లాయనకు అంతదూరం ఆలోచన పోతే కదా! తన పెళ్ళయి పదేళ్లు కావస్తున్నది. ఆయన ఇక మారేది లేదు అనుకుంటుంది సావిత్రి. కాని అనుకోకుండా ఒకరోజున ఆయన

తనకొక సంతోషకరమైన వార్త చెబుతారని సావిత్రి అనుకోలేదు. తన స్నేహితుడే ఒకడు ఆ యింట్లోకి వస్తాడుట. ఇవాళ ఆఫీసులో కనిపించి చెప్పేడట. ఈ వూరికి కొత్తగా బదిలీ అయి వచ్చాడుట ఆతను. అయితే ఇంకా నెలరోజులు పట్టవచ్చునట అతడు సంసారం తీసుకొచ్చుకునేసరికి. గుడ్డిలో మెల్ల అని సంతోషించింది సావిత్రి.

మర్రోజు సాయంకాలం ఆయన తన స్నేహితుణ్ణి వెంటబెట్టుకుని వచ్చారు. తాళం తీసి భాగమంతా చూపించారు. అవతలివేపు నున్న భాగంకూడ ఇంతేనని చెప్పారు. ఆ తరవాత తమ వరండా బయటగదిలో కూర్చున్నారు. తాను కాఫీ తీసుకుపోయి ఇచ్చినప్పుడు, ఆయన తనను స్నేహితుడికి పరిచయమూ చేశారు. తాను చనువు తీసుకుని ఆడవాళ్ళని త్వరగా తీసుకురమ్మని చెప్పింది. అతడా పూట అక్కడ భోజనమూ చేశాడు. చిట్టచివరి లోకల్ ట్రెయినుకు వెళ్ళిపోయాడు. సావిత్రికి ఆనందమూ కాదు, విచారమూ కాదు, ఎందుకో ఒకందుకు మనసుకు చాలా వింత అనిపించింది. అతడు గుర్తుపట్టాడో లేదోకాని తనకు జ్ఞాపకం వచ్చాడు. పదేళ్ళ కిందట ఇతడే పెళ్ళి చూపులకు వచ్చినప్పుడు, తెగబడిఎవరు చెప్పినా వినిపించుకోక, ఖండితంగా 'నేనుచేసుకోను. ఈసంబంధం నాకొద్దు' అనిచెప్పిందితాను. తన మొండితనానికి తనవాళ్ళంతా ఆశ్చర్యపోయారు. అప్పటికి కుర్రాడు ఇంటర్మీడియట్ మాత్రమే పాసుకావటమూ, చేస్తున్న వుద్యోగం చూడబోతే సెక్రటేరియట్ గుమాస్తాగిరీ, ఇంకనూ రూపవంతుడా అంటే ఇన్నాళ్ళూ తన కలల్లో అవుపడుతున్న పురుషునికి చేరువగానైనా రాకపోవడమూ, డబ్బూలేక, చదువూలేక, అందమూలేక, ఆర్జనా లేక, హోదాలేక ఏమనిచేసుకోవాలి? అని ప్రశ్నవచ్చి, సమాధానంరాక ఆ సంబంధానికి వప్పుకోలేదు సావిత్రి అప్పుడు. పైన అదీగాక, అప్పుడప్పుడే, అంటే అదేకొత్తగాతనకు పెళ్ళి సంబంధాలు రావటమూ, పెళ్ళి చూపులకు ఎవరో రావటమూ మొదలయిందేమో మనస్సును అసలు సరిపెట్టుకోలేకపోయింది. కలలు ఎంత చెడ్డవి? ఓడిపోతేనే కదా రాజీపడటం! సరే తర్వాత సావిత్రికీ పెళ్ళయింది. సావిత్రి ఆ రాత్రి

భర్తను అడిగింది, ఆ సాయంకాలం వచ్చిన స్నేహితుడికి ఉద్యోగ మేమిటని, జీతమెంతని, పిల్లలెందరని. అతడు చెప్పాడు. ఉద్యోగం తనకంటే పెద్ద ఉద్యోగమేనని, జీతం కూడా ఎక్కువేనని, పిల్లలు కూడ వున్నారని. సావిత్రి విసుక్కుంది, పిల్ల లెంతమందో తనకు తెలీదని భర్త చెప్పినందుకు. ఆయనకంటే మీరు ఎక్కువ చదువు కున్నారుగదా-ఆ ప్రమోషను మీ కెందుకురాలేదు అని అడిగింది. ఆతడికి సర్వీసు ఎక్కువ ఉంది అని చెప్పారు ఆయన. గవర్న మెంటును గురించి కూడ విసుక్కుంది సావిత్రి. ఆ సుబ్బారావు భార్యాపిల్లల్ని గురించి ఆలోచించుకుంటూ నిద్రపోయింది.

ఆ తరువాత రెండురోజులకు సుబ్బారావు ఆ ప్రక్కభాగంలో చేరిపోయాడు. కాని సావిత్రికి కాలక్షేపం లేకపోయింది. పైన సావిత్రికి సుబ్బారావు తమ ప్రక్కభాగంలోకి అద్దెకు రావడం అంత యిష్టంకూడా లేదు. ఒకవేళ సుబ్బారావు తనను గుర్తుపట్టి వెనకటి విషయాలను జ్ఞాపకం చేసుకుంటాడేమో నని ఆమెకు భయం లేదు కాని, యిష్టంలేదు. ఆ సుబ్బారావు భార్యవాళ్ళు వచ్చిన తరవాత చెబుతాడో యేమో! అయినా సుబ్బారావు భార్యా పిల్లలు యెప్పుడు వస్తారా, తాను వాళ్ళను ఎప్పుడు చూస్తానా? అని మనసులో యెదురు చూడసాగింది. ఇంతలో ఇంకో వింతకూడా జరిగింది. పక్కభాగం లోకి ఒకరోజు ప్రొద్దున తట్టా బుట్టా,ఉయ్యాలా, పెట్టా బెడ్డింగులూ, రేడియాతో సహా యెవరో వచ్చి దిగారు. ఆ సాయంకాలం సావిత్రి యెలాగైనా పరిచయం చేసుకోవాలని అనుకుంటూవుండగా, నాలుగై దేళ్ళ ఒకచిన్నపాపవచ్చి"అమ్మఅగ్గిపెట్టె ఇప్పించుకురమ్మంటోంది" అంది ముద్దు ముద్దు మాటలతో. సావిత్రిఇచ్చిపంపించి ఆలోచనలలో మునిగిపోయింది. "పోనీ ఇంకా కొన్నాళ్ళదాకా సుబ్బారావుగారి సంసారంకోసం యెదురుచూడవలసిన అవసరంలేదు." అనుకుంది. మర్రోజు ఆ గృహిణే మధ్యాహ్నం వచ్చి మాటామాటా కలిపింది. ఆయన టూర్ వెళ్ళారట. నెలకు పదిహేనురోజులు యింటివద్దనే వుండరనీ. వుద్యోగం చూడబోతే గొప్ప, మంచి ఉద్యోగం కాదని,

ఏదో బ్రతకలేక చేయవద్దా? అనీ ఆవిడ చెప్పినదాంట్లో సారాంశం గ్రహించింది సావిత్రి. చిత్రం అనుకుంది. బాగానేవుంది అనుకుంది. తరవాత ఆ భాగంలోని ఆమె తరచూ సావిత్రి దగ్గరకు వచ్చి కూర్చుంటూ వుండేది. ఆమెకు ముగ్గురు పిల్లలు. పెద్దపిల్ల లిద్దరూ మగపిల్లలూ, చిన్నది ఆడపిల్ల. చిన్నపిల్ల సావిత్రిదగ్గర చదువు కూడా నేర్చుకుంది. ఆచిన్నపిల్ల పేరు సరళ. మగపిల్ల లిద్దరూ రామం, గోపీ. వాళ్ళు సావిత్రికి దూరంగా నిలబడి బిక్కుబిక్కుమంటూ చూసేవారు. రేపు మా వాళ్లు వస్తారని వో రోజు, ఆరోజు ఆదివారం కాబోలు, ఆయనకు సుబ్బారావు చెబుతుంటే సావిత్రి విన్నది. సావిత్రికి మళ్ళీ వుత్సుకత కలిగింది. నవ్వూ వచ్చింది. సుబ్బారా వా వేళంతా ఇల్లు సర్దుతూనే వున్నాడు.అన్ని సంభారాలూ ఒక్కొక్కటే తెచ్చి పడేస్తూవున్నాడు. సావిత్రికి ముచ్చటైంది. నవ్వూ వచ్చింది.

మర్రోజు ప్రొద్దున్నే ఇవాళ సుబ్బారావుగారి పిల్లలూ, భార్యా వస్తారు కాబోలు ననుకుంటూ ఏదో ఆలోచించుకుంటూ సావిత్రి పెరట్లోకి వెళ్ళింది. యాథాలాపంగా ఇన్నాళ్ళూ తాను చూదామనుకుంటున్న వ్యక్తిని చూసింది. బాయిలర్‌లో నీళ్ళు పోస్తున్నా డాయన. జన్మంతా నెలకు పదిహేనురోజులు ఇంటిదగ్గర వుండకుండా టూరు మీద తిరిగే వ్యక్తి. సావిత్రికి నవ్వొచ్చింది. ఇందుకేనేమో ఆయన నెలలో పదిహేనురోజులు టూరుమీద పోవడం అనిపించింది. ఆమె ఏం చేస్తున్నదో? ఇంటిదగ్గరవున్న పదిహేనురోజులు యీయనే నీళ్లు కాగబెట్టుకోవాలేమో! అనుకుంది సావిత్రి. కొంచెం పరిశీలనగానే చూసింది. సావిత్రికి భయమూ, దిగులూ కాదుగాని, చాలా ఆశ్చర్యం, కొంచెం దిగులూ కలిగినయ్. తా నొకప్పుడు అందంగా వున్నా దను కొన్న మనిషి. ఒకప్పుడు తనను చూడటానికి వచ్చినవాడు. తాను చేసుకుంటానని అన్నది కూడా. తరవాత అతడు పిల్ల నచ్చలేదన్నాడని తమ ఇంట్లోవారు చెప్పుకున్నప్పుడు, కోపంతోనూ అవమానంతోనూ దహింపబడ్డది. ఆ సావిత్రే యీ సావిత్రి. చప్పున వంటింట్లోకి వచ్చేసింది. గుమ్మంలో నిలబడి పరిశీలించి చూసింది.

సందేహంలేదు. కృష్ణమూర్తే! అప్పుడు ఎం. ఎ. చదువుకుంటు న్నాడు. తనను చూడటానికి వచ్చినప్పుడే కూచున్న నాలుగు నిమి షాలూ అందర్నీ నవ్వించాడు. తాను ఎవరికీ కనపడకుండా నవ్వి నట్లు చాలారోజులవరకూ తనకూ జ్ఞాపకమున్నది. సావిత్రికి ఎందుకో దిగులైంది. బయట పాలవాడి కేక వినిపించి, ఆలోచన ల్లోంచి తేరుకుని గిన్నె పట్టుకుని వచ్చింది. పాలవాడు పాలు పోస్తు న్నాడు. పక్కభాగంలోంచి గిన్నె పట్టుకుని అతనూ వచ్చాడు. అతనే! కృష్ణమూర్తి. పిల్ల నచ్చలేదని చెప్పినవాడు. తనను చేసుకో నన్నవాడు. 'ఒకప్పుడు అందమైనవాడు సుమా!' అని తా ననుకొన్న వాడు! గిన్నె పట్టుకువచ్చాడు పాలు పోయించుకోటానికి! పదేళ్ళ క్రితం ఆ ముక్కు ఇంకా బావుండేది. ఆ కళ్ళు ఇంకా అల్లరి చేస్తూ వుండేవి. ఆ మాట! ఇప్పు డసలు వినపడదేం? వా ళ్ళావిడ, పోనీ నెలకు పదిహేనురోజుల లెక్క చొప్పునైనా నవ్వినట్లు తనకు విన పడదు. సావిత్రి విషాదంగా నవ్వుకుంది!

సుబ్బారావుగారు ఆవాళ వంట చేస్తుంటే సావిత్రి ఆయన గారిచేత చెప్పించింది సుబ్బారావుగారికి 'పోనీ, యీపూటకు మా యింట్లో భోంచేస్తారులే! ఏమో, మేమంతా పరాయివాళ్ళమా? ఒక్క పూట మీ కింత భోజనం పెట్టలేమా!'' అని. కాని సుబ్బారావు విన లేదు. వాళ్ళ ఆదరానికి ప్రాణం లేచివచ్చేట్లుగా స్నేహంగా నవ్వుతూ జవాబిచ్చాడు. "ఇంకోసారి వస్తాము లెండి" అని. సుబ్బారావు పచ్చడి నూరుకుంటూవుంటే, కూర తిరగమోత వేస్తూవుంటే, సావిత్రి విషాదంగా, విచిత్రంగా నవ్వుకుంది. సుబ్బారావు ఆఫీసుకు పోయాడు. కృష్ణమూర్తి టూర్‌మీద వెళ్ళాడుట, మధ్యాహ్నం.ఆవిడ చెప్పింది కృష్ణమూర్తిగారి భార్య. "కృష్ణమూర్తి తనను చూశ్లేదులా వుంది. చూస్తే, గుర్తుపడితే, ఏమనుకుంటాడు? ఏమనుకోడు. ఏమో! ఏమనుకొంటాడో!'' అనుకుంది సావిత్రి.

సరళ వచ్చి వళ్ళోకూర్చుంది, పిలవకుండానే. వద్దనలేక పోయింది. అంతా విచిత్రం అనుకుంది.

మధ్యాహ్నం సుబ్బారావుగారు ఏను గెక్కినంత సంతోషం గానూ, కొత్తగా ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేస్తున్నవాడిలా గానూ, ముగ్గురినో. నలుగురినో ఎత్తుకోవడం చేతగాక, ఇద్దరిని ఎత్తుకుని, తక్కిన ఇద్దర్నీ నడిపించుకుంటూ వీళ్ళ నలుగురి తల్లికీ, మహారాణిగారిముందు నడిచే వేత్రహస్తుడికి మల్లే ముందు నడుస్తూ ఇంట్లో ప్రవేశించాడు. ఆ దృశ్యం చాలా ముచ్చటగొల్పింది సావిత్రికి. వచ్చినవాడు వెంటనే తన ఆఫీసూ, పనీ వుండదూ, వెళ్ళిపోవచ్చునా, వెళ్ళిపోలేదు. ఆ ఇంటి సౌకర్యమంతా, తెలుగు ప్రబంధంలా వివరించి చెప్పాడు రాణీగారికి. ఆ తరువాత వాళ్ళను భోజనానికి కూచోబెట్టాడు కాబోలు, తన పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని గురించి వాళ్ళకు ఉపన్యసిస్తూ, తనని తానే పొగడుకొంటున్నాడు. సావిత్రికి నవ్వూ వచ్చింది. ఆపైన ఆ రాణీగారిని తలచుకుంటే జాలీ కలిగింది. సుబ్బారావుగారు ఆమె చెప్పిన లిష్టంతా వ్రాసుకుని నాలుగు గంటలకో, ఐదు గంటలకో బయటపడటమూ చూసింది. సుబ్బారావు భార్య సాయంకాలం కాగానే తనకుతానై వచ్చి సావిత్రితో పరిచయమూ చేసుకుంది.

సావిత్రి ఆవిడ మాట తీరునూ, మనిషి తీరునూ చూసి మూర్ఛిన్నపడిపోయింది, ఆమె అంత అందమైంది. అంత మాటా మన్ననా తెలిసినది. పిల్లలంతా తల్లి పోలికే. బిడ్డలను చూస్తే ముద్దుపెట్టుకుందామనిపించేట్లుగా వున్నారు. పెద్దపిల్లలిద్దరూ సావిత్రి చెరివాక ప్రక్కా చేరిపోయారు. ఎడపిల్లా, పసిపిల్లవాడూ. పెద్దపిల్లలిద్దరూ మగపిల్లవాడూ, ఆడపిల్లా—పెద్దపిల్లవాడికి ఎనిమిదేళ్ళుంటాయి. రెండో పిల్లకు ఐదేళ్ళు. మూడోదానికి మూడో ఏడు. పసి పిల్లాడికి యేడాది వెళ్ళిందట. కృష్ణుడూ, కాత్యాయనీ, రాధా, మధూ రత్న మాణిక్యాలూ, వజ్రాలూ, వైడూర్యాలూ. వాళ్ళ తల్లి వేపు కన్నార్పకుండా చూసింది సావిత్రి. సుబ్బారావు పెళ్ళిసంబంధానికి వచ్చి తనను చూడటమూ,

తాను కృష్ణమూర్తిని చూడటమూ జ్ఞాపకానికి వచ్చింది. కారూ, బంగళా, పిల్లలూ, నగలూ, అన్ని కలలూ జ్ఞాపకానికి వచ్చాయి అప్పుడు. కాని ఆ జ్ఞాపకాలు వెంటనే విస్మృతిలోకి నెట్టి వేసింది. ఆ తరువాత కృష్ణమూర్తి తనను గుర్తుపట్టాడా అనీ ఆమె అనుకోలేదు. సుబ్బారావు భార్యను గురించీ అనుకోలేదు. ఈ భాగం లోంచి ముగ్గురూ, ఆ భాగంలోంచి నలుగురూ వచ్చి తమభాగంలోనే ఆడుకుంటారు. వాళ్ళు బొమ్మ పెళ్ళిళ్లు చేసుకుంటూవుంటే ఆ సంభారా లన్నీ తానే వాళ్ళకు సమకూర్చి పెడుతుంది సావిత్రి. సరళనూ, కృష్ణణ్ణీ వొకపక్కగా తన దగ్గరకు తీసుకున్నప్పుడుగాని, రామాన్నీ కాచినీ వొకపక్కగా దరికి తీసుకున్నప్పుడుగాని తనకు కృష్ణమూర్తీ సుబ్బారావూ ఇద్దరూ గుర్తుకొస్తారు. ఆ తీరున ఆ చిన్నపిల్లలను-మల్లెపువ్వుల్లాంటి వాళ్ళను చూసినప్పుడు, ఎంత ముచ్చట కలిగినా ఆ తరువాత-అంటే వాళ్ళు పెద్దవాళ్లు అయిన తరువాత వాళ్ళ జీవితాన్ని గురించి ఆలోచించటానికి సావిత్రి ఎందుకో మనసులో భయపడి పోయేది....

---